సాక్షి అన్నమయ్య జిల్లా

గురువారం । 25 । జనవరి । 2024



అందరికీ అమ్మ.. జయమ్మ

మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి మాతృమూర్తి వైఎస్ జయమ్మ. ఆమెజీవించి ఉన్నంత కాలం ప్రజల కష్టసుఖాల్లో పాలు పంచుకుంటూ దానధర్మాలు చేసేవారు. -10లో



శాంతియుత మార్గమే మునిరెడ్డి ఆయుధం

రావుల మునిరెడ్డి శాంతిని ఆయుధంగా చేసుకుని బ్రిటీషువారితో పోరాడారని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి అన్నారు. -10లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.190	రూ.260
రెండోరకం	రూ.100	రూ.186

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 123 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

నేడు పౌర్ణమి కల్యాణం



కోదండరామస్వామి మూలవిరాట్

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట కోదండరామాలయంలో గురువారం పౌర్ణమి సందర్భంగా సీతారాములకు పౌర్ణమి కళ్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ డిప్యూటీ ఈఓ నటేష్ బాబు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రతి నెల స్వామివారికి పౌర్ణమి కళ్యాణం నిర్వహించడం జరుగుతుందని, భక్తులు కళ్యాణానికి హాజరై స్వామివారి కృప పొందాలని కోరారు.

26న పట్టుగూళ్ల మార్కెట్‌కు సెలవు



మదనపల్లె సిటీ: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 26న మదనపల్లె పట్టుగూళ్ల మార్కెట్‌కు సెలవు ప్రకటించినట్లు మార్కెట్ కార్యదర్శి లక్ష్మిదేవి తెలిపారు. ఈ విషయంను పట్టు రైతులు, రీలర్లు గమనించాలని సూచించారు.

రాయచోటి సిగలో మరో కలికితురాయి శిల్పారామం

రామాపురం: రాయచోటి సిగలో శిల్పారామం మరో కలికితురాయి కానుందని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణ శివారు బండపల్లె గ్రామంలోని జాతీయ రహదారి పక్కనే గల 12 ఎకరాలలో నిర్మితమవుతున్న శిల్పారామం పనులను పరిశీలించారు. పనుల నాణ్యతపై ఆరా తీసి త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా శిల్పారామం పనులు జరుగుతున్నాయని, సకల సౌకర్యాలతో గ్రామీణ వాతావరణాన్ని వెలువరించే విధంగా వృత్తి నైపుణ్యం , జీవన విధానాల సమాహారంగా , జిల్లా కేంద్రంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు చక్కని ఆట విడుపుగా శిల్పారామాన్ని నిర్మించడం జరుగుతోందన్నారు. ఆయనతో పాటు జెడ్పీటీసీ వెంకటరమణ, మాజీ రెస్కో చైర్మన్ కృష్ణారెడ్డి, కేపీఆర్ కన్‌స్ట్రక్షన్ చెన్నారెడ్డి, మాజీ సర్పంచ్ రాజారెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలకు ఆహ్వానం



జిల్లా ఎస్పీకి ఆహ్వానపత్రికను అందజేస్తున్న డీఈవో శ్రీరాం పురుషోత్తం తదితరులు

రాయచోటి టౌన్: బాలికల కబడ్డీ టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి రావాలని అన్నమయ్య జిల్లా ఎఫ్ఏసీ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్‌ఖాన్, జిల్లా ఎస్పీ కృష్ణారావులను అన్నమయ్య జిల్లా విద్యాశాఖాధికారి శ్రీరాం పురుషోత్తం ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి 1వతేది వరకు ఇన్‌సాంట్ జీసెస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ రాజంపేటలో అండర్-14 బాలిక కబడ్డీ జాతీయ పోటీలు జరగనున్నట్లు వివరించారు. ఈ టోర్నమెంట్ కార్యక్రమానికి హాజరు కోరుతూ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్జీఎఫ్ సెక్రటరీ వసంత, వ్యాయామ ఉపాధ్యాయ సంఘంప్రధాన కార్యదర్శి వీరాంజనేయులు, జాయింట్ సెక్రటరీ రెడ్డెయ్య, అసోషియేట్ ప్రెసిడెంట్ శ్రీనివాసులు, లీగల్ అడ్వైజర్ వేణు మాధవరాజు, రాజంపేట జోన్ ప్రధాన కార్యదర్శి రవీంద్రరాజు, రాయచోటి జాయింట్ సెక్రటరీ ఆంజనేయులు, చక్రపాణి పాల్గొన్నారు.

'మిట్స్'కు మొదటి బహుమతి



మొదటి బహుమతితో మిట్స్ విద్యార్థులు

కురబలకోట: హర్యానా రాష్ట్రం ఫరీదాబాద్‌లో జరిగిన ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌లో ఓరల్ ప్రజెంటేషన్ పోటీల్లో మదనపల్లె దగ్గర అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. బీటెక్ కంప్యూటర్ (డేటా)సైన్స్ ఇంజినీరింగ్ మూడవ ఏట చదువుతున్న ఎం. సందీప్, పి. యాసిన్‌ఖాన్, త్రిశాంక్ మొదటి బహుమతి సాధించినట్లు ప్రిన్సిపాల్ యువరాజ్ తెలిపారు. అటానమస్ ఫ్లైయింగ్ కాప్టర్ ఫర్ పబ్లిక్ సేఫ్టీ అంశంపై ప్రజంటేషన్ కు ఈ బహుమతి లభించినట్లు తెలపారు.

సగిలేరు.. సరిచేశారు




- రూ. 3.85 కోట్ల నిధులతో గేట్ల నిర్మాణం పూర్తి
- పూర్తి స్థాయిలో అభివృద్ధికి వైఎస్ జగన్ ప్రభుత్వం శ్రీకారం
- నీటి నిల్వకు తొలగిన అడ్డంకులు
- ప్రాజెక్టు అభివృద్ధిని పూర్తిగా విస్మరించిన టీడీపీ



కొత్త గేట్ల నిర్మాణంతో నీటితో కళకళలాడుతున్న లోయర్ సగిలేరు ప్రాజెక్టు (ఇన్‌సెట్) లోయిల్ సగిలేరు ప్రాజెక్టు

కడప సిటీ: ప్రభుత్వం జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులపై శ్రద్ధ వహించింది. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులకు నిధులు కేటాయించి పనులు పూర్తి కావడంతో ఆయకట్టు పెరగడంతోపాటు రైతుల భూములకు నీళ్లించేందుకు మార్గం సుగమమైంది. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టాక లోయర్ సగిలేరు ప్రాజెక్టు (ఎల్ఎస్‌పీ) రూపురేఖలు మారాయి. టీడీపీ ప్రభుత్వం ఈ ప్రాజెక్టు అభివృద్ధిని పూర్తిగా విస్మరించింది. ఒక గేటు కొట్టుకునిపోయినప్పటికీ స్పందించలేదు. మిగిలిన గేట్లు కూడా తుప్పు పట్టినప్పటికీ ఏమాత్రం శ్రద్ధ వహించలేదు.దీంతో ఉన్న నీరంతా వృథాగా సోమశిలలో కలిసిపోయింది.రైతులకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. లోయర్ సగిలేరు ప్రాజెక్టు 1959లో నిర్మాణమైంది. 2018లో ప్రాజెక్టు నుంచి నీళ్ల వదిలేందుకు హైదరాబాద్ వెళ్లిన ఓ ప్రజాప్రతినిధి కోసం వేచి చూసి కాలయాపన చేశారు. ఈ నేపథ్యంలో ప్రాజెక్టుకు ఉన్న రెండో గేటు కొట్టుకునిపోయి నీళ్లన్నీ వృథాగా సోమశిలకు చేరాయి. అప్పట్లో పబ్లిసిటీ కోసం ఇంత దారుణానికి టీడీపీ నేతలు ఒడిగట్టారని రైతులు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రాజెక్టు అభివృద్ధి పనులపై దృష్టి సారించింది. యుద్ధప్రాతిపదికన పనులను చేపట్టి పూర్తి స్థాయిలో 13 వేల ఎకరాల ఆయకట్టుకు నీళ్లందించేందుకు చర్యలు చేపట్టింది. 1959 నాటి ఈ ప్రాజెక్టు నిర్మాణానికి ఉన్న ఐదు గేట్లు కొత్తవి మార్చి ప్రాజెక్టుకు కొత్తరూపును తీసుకొచ్చింది.రూ. 3.85 కోట్లు వెచ్చించి అహ్మదాబాద్ నుంచి ప్రత్యేక నిపుణులను రప్పించి గేట్లను అమర్చారు. ఈ ప్రాజెక్టు అభివృద్ధి పనులపై ఎల్లో మీడియా నిజనిజాలు తెలుసుకోకుండా ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేసిన సందర్భాలు లేకపోలేదు. కెనాల్



సామర్థ్యాన్ని పెంచేందుకు రూ. 80 కోట్లతో పనులు చేపట్టారు. 200 క్యూసెక్కుల నుంచి 500 క్యూసెక్కుల నీరు ప్రవహించేలా ఈ కాలువల నిర్మాణం దాదాపు పూర్తయ్యే పరిస్థితికి వచ్చింది.

కొత్త గేట్ల నిర్మాణంతో సాగుకు నీళ్లు

ఎల్ఎస్‌పీకి కొత్త గేట్ల నిర్మాణం పూర్తి కావడంతో రైతుల భూములకు సాగునీరు ఇచ్చేందుకు అవకాశాలు మెండుగా వచ్చాయి. బి.కోడూరు మండలం వంకమర్రి ప్రాంతం వద్ద లోయర్ సగిలేరు ప్రాజెక్టు (ఎల్ఎస్‌పీ) ఉంది. పూర్తి స్థాయి నీటి సామర్థ్యం 169 ఎంఎస్ఎఫ్‌టీ (ఘనపు అడుగులు)గా ఉంది. భూగర్భ జలాలు పెంపొందించడమే కాకుండా 13 వేల ఎకరాలకు నీరందించే లక్ష్యంగా 1954 నుంచి 1959 సంవత్సర కాలంలో ప్రాజెక్టు నిర్మాణం జరిగినట్లు తెలుస్తోంది. కాలాతీతం కావడంతో గేట్లు దెబ్బతిన్నప్పటికీ గత టీడీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. దీంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ ప్రాజెక్టు నిర్మాణ అభివృద్ధి పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపారు. అందులో భాగంగానే రూ. 3.85 కోట్లతో కొత్త గేట్ల నిర్మాణం చేపట్టారు. ఈ గేట్ల నిర్మాణం కూడా పూర్తి కావడంతో ప్రాజెక్టులో నీరు నింపి కాలువలకు వదిలారు. అలాగే కెనాల్ సామర్థ్యాన్ని 200 నుంచి 500 క్యూసెక్కులకు పెంచేందుకు చర్యలు తీసుకున్నారు. ఇందుకుగాను రూ. 80 కోట్లు ఖర్చు చేశారు.

- ప్రాజెక్టు కొత్త గేట్ల నిర్మాణం పూర్తి కావడంతో నీటిని కాలువల ద్వారా పంపించి 40 చెరువులను నింపేందుకు అవకాశం కలిగింది. బి.కోడూరు, బద్వేలు, బ్రహ్మంగారిమఠం తదితర ప్రాంతాల్లో ఉన్న ఈ చెరువులకు నీటిని నింపడంతో ఆయకట్టుకు నీరు అందడమే కాకుండా భూగర్భ జలాలు పుష్కలంగా పెరిగేందుకు వీలు కలిగింది.

కాలువల నిర్మాణాన్ని గాలికొదిలేసిన టీడీపీ

ప్రాజెక్టు నిర్మాణాన్ని గత టీడీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. గేట్లు తుప్పపట్టినప్పటికి కొత్తవి నిర్మించలేదు. కాలువల నిర్మాణాన్ని కూడా గాలికి వదిలేసింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ప్రాజెక్టు అభివృద్ధి పనులు శరవేగంగా జరిగాయి. దీంతో రైతులు తమ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పంటలు ఎండిపోకుండా సాగునీరు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎల్ఎస్‌పీ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడంతో పనులు పూర్తయ్యాయి. పంటలు ఎండిపోకుండా కాపాడగలిగే పరిస్థితి నెలకొంది. ఈ ప్రాజెక్టు కింద 13 వేల ఎకరాల ఆయకట్టు ఉండగా, ఖరీఫ్‌లో రెండు వేల ఎకరాలకు, రబీ లో 10 వేల ఎకరాలకు సాగునీరు అందేలా అధి కారులు చర్యలు చేపట్టారు. అలాగే భూగర్భజలాలు పెరగడంతో బోరు బావుల కింద పంటల ను సాగు చేసుకునే వీలు కలిగింది. -డి.వెంకట్రామయ్య, ఈఈ, నీటిపారుదలశాఖ, కడప

27న ఇంటర్వ్యూలు

వైవీయూ: కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఈనెల 27వ తేదీ శనివారం బీపీఓ టెలీకాలర్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. సలీంబాషా తెలిపారు. ఆసక్తి గల డిగ్రీ అర్హత కలిగిన అభ్యర్థులు పూర్తి వివరాలకు జేకేసీ మెంటార్లు రవీంద్రారెడ్డి 9390052901, వరప్రసాద్ 9059066031 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

గవర్నర్ తేనీటి విందుకు ప్రకృతి వ్యవసాయ రైతు



గోగుల రాధాకృష్ణయ్య

కడప అగ్రికల్చర్: వైఎస్సార్‌జిల్లా బద్వేల్ మండలం చింతల చెరువు అబ్బుసాహెబ్‌పేటకు చెందిన ప్రకృతి వ్యవసాయ రైతు గోగుల రాధాకృష్ణయ్య జనవరి 26న గణతంత్ర దినోత్సవ వేడుకలలో పాల్గొననున్నారు. ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌తో కలిసి విజయవాడ రాజభవన్ లాన్స్‌లో తేనీటి విందు కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆహ్వానం అందింది. ఈ మేరకు గోకుల రాధాకృష్ణయ్య విజయవాడకు బయలు దేరనున్నారు.ఈయన ఇరిగేషన్‌లో అసిస్టెంట్ టెక్నికల్ ఆఫీసర్‌గా పనిచేస్తూ 2013లో పదవీ విరమణ చేశారు. తర్వాత వ్యవసాయంపై ఉన్న మక్కువతో తన 7 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంటలసాగు ప్రారంభించారు. 5 ఎకరాల్లో 15 దేశవాళి వరి, మరో రెండు ఎకరాల్లో కరివేపాకు పంట సాగు చేస్తున్నారు. 2017లో ప్రభుత్వం నాన్ పెస్టిసైడ్ మేనేజ్‌మెంట్ షాపు(ఎన్‌పీఎం) మంజూరు చేసింది. ఆ షాపు ద్వారా తమ పొలంలో పండించిన వరిధాన్యాన్ని మన రాష్ట్రంతోపాటు మరో రెండు రాష్ట్రాల రైతులకు ఆన్‌లైన్‌లో పంపుతున్నారు.స్థానికంగా తన షాపు ద్వారా కషాయాలు, జీవామృతం, ఘన జీవామృతాలను అందచేస్తూ ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నారు. దీంతోపాటు భూమిలో కర్బనశాతం పెంచడం, రసాయనిక రహిత భూమిని తయారు చేయడం, మనుషుల, పర్యావరణ ఆరోగ్యం కాపాడటం కోసం పలువురు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

గ్రామీణ క్రీడాకారుల ప్రతిభకు ప్రోత్సాహం



కబడ్డీ ఆడుతున్న ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి

నియోజకవర్గస్థాయి ఆడుదాం ఆంధ్ర ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే , ఇన్‌చార్జ్ కలెక్టర్

రాయచోటి: ఆడుదాం ఆంధ్రతో గ్రామీణ క్రీడాకారుల ప్రతిభకు ప్రోత్సాహం లభిస్తోందని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అన్నారు. బుధవారం అన్నమయ్య జిల్లా రాయచోటిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. సంక్షేమం, అభివృద్ధిలో రాష్ట్రాన్ని ఆదర్శంగా నిలిపిన సీఎం జగన్ మోహన్ రెడ్డి క్రీడలలో కూడా రాష్ట్రాన్ని ఆదర్శంగా నిలపాలన్న మహోన్నత లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. పారిశ్రామిక రంగంలో ఈజ్‌ఆఫ్ డూయింగ్‌లో రాష్ట్రం నెంబరు వన్ స్థానంలో ఉందన్నారు. క్రీడలలో కూడా రాష్ట్రం ముందంజలో ఉండాలన్నదే సీఎం జగన్ ధ్యేయమన్నారు. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో అన్నమయ్య జిల్లాఆదర్శంగా నిలిచేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. క్రీడా స్ఫూర్తితో క్రీడాకారులు పోటీలలో పాల్గొనాలని సూచించారు. క్రీడా పోటీలలో పెద్దఎత్తున పాల్గొనడానికి క్రీడాకారులు రావడం ఆనందించదగ్గ విషయమన్నారు. కాతగా నియోజకవర్గస్థాయిలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, క్రికెట్ పోటీలు నేడు ఘనంగా ప్రారంభమయ్యాయి. అంతకుముందు కబడ్డీ, వాలీబాల్ పోటీలలో క్రీడాకారులతో కలిసి ఎమ్మెల్యే, ఇన్‌చార్జ్ కలెక్టర్, అధికారులు కొంతసేపు ఆడి క్రీడాకారులను ఉత్తేజపరిచారు. ఈ పోటీలను తిలకించడానికి ప్రజలు పెద్దఎత్తున గ్రౌండ్‌కు తరలివచ్చారు. మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష, వైస్ చైర్మన్ ఫయాజుర్ రెహమాన్, ఆర్డీఓ రంగస్వామి, డ్వామాపీడి మద్దిలేటి, మున్సిపల్ కమీషనర్ గంగాప్రసాద్, ఎంపీడీఓ మల్ రెడ్డి, తహశీల్దార్ ప్రేమంత కుమార్, స్పోర్ట్స్ అధికారి చంద్రశేఖర్,ఆడుదాం ఆంధ్ర గేమ్స్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నూకల నరసరాజు, కబడ్డీ కోచ్ షఫీ, ఎస్టీఓ గౌస్ బాష, ఫిజికల్ డైరెక్టర్లు, ఇతర ప్రజా ప్రతినిధులు క్రీడాకారులు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు

అధికారులను ఆదేశించిన ఇన్‌చార్జ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్



జిల్లా పోలీస్‌పెరేడ్ గ్రౌండ్‌ను పరిశీలిస్తున్న జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, అడిషనల్ ఎస్పీ రాజ్‌కమల్

రాయచోటి: భారత గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు స్థానిక పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో పటిష్టంగా ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం రాయచోటిలోని జిల్లా పోలీస్ పరేడ్ మైదానంలో భారత గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లను అడిషనల్ ఎస్పీ రాజ్‌కమల్‌తో కలిసి పరిశీలించారు. గణతంత్ర వేడుకలను పెరేడ్ గ్రౌండ్‌లో ఘనంగా నిర్వహించేలా, గ్రౌండ్‌ను డయాస్‌లను పోలీస్, రెవెన్యూ అధికారులు చక్కని అలంకరణతో సిద్ధం చేయాలన్నారు. వేడుకల సందర్భంగా ప్రజాప్రతినిధులకు, జిల్లా అధికారులకు, స్వాతంత్ర్య సమరయోధులకు, ప్రజలకు సీటింగ్ అరేంజ్‌మెంట్లు ప్రొటోకాల్ ప్రకారం చేయాలని రెవెన్యూ డివిజనల్ అధికారిని ఆదేశించారు. ఈ మేరకు మైదానంలో ఏర్పాట్లను ఆయన పరిశీలించి తగిన ఆదేశాలు జారీ చేశారు. శాఖల ప్రగతిని చూపి శకటాల వివరాలను జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రౌండ్ అంతా పరిశుభ్రంగా ముస్తాబు చేయాలన్నారు. ప్రజలందరూ వేడుకలను వీక్షించేలా అవసరమైన అన్ని సౌకర్యాలను చేయించాలన్నారు. రాయచోటి ఆర్డీఓ రంగస్వామి, మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాతాశిశు మరణాలను నియంత్రించాలి

జిల్లాలో మాతాశిశు మరణాలు జరగకుండా నియంత్రించేందుకు అవసరమైన పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో మాతాశిశు మరణాల నివారణపై వైద్య, ఆరోగ్య శాఖ అధికారులతో జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు. అడిషనల్ ఎస్పీ డాక్టర్ రాజ్‌కమల్, డీఎంహెచ్ఓ డాక్టర్ కొండయ్య, ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లను రక్షించడం అందరి బాధ్యత



ర్యాలీని ప్రారంభిస్తున్న ఇన్‌చార్జ్ కలెక్టర్

రాయచోటి అర్బన్: బాలికల పరిరక్షణ అందరి బాధ్యత అని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్‌ఖాన్ అన్నారు. జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాయచోటిలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. స్థానిక డైట్ కళాశాల వద్ద ర్యాలీని ఇన్‌చార్జ్ కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ నేతాజి సర్కిల్ వరకు సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికా సంరక్షణతో పాటు సాధికారత కల్పించే విధంగా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఆడ పిల్లలను మగపిల్లలతో సమానంగా పెంచడంతో పాటు వారికి కూడా మగపిల్లలతో సమానంగా అన్నిరకాల అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. భ్రూణహత్యలను అరికట్టడాన్ని సామాజిక బాధ్యతగా తీసుకోవాలన్నారు. డీఎం అండ్‌హెచ్ఓ డాక్టర్ కె.కొండ య్య, ఐసిడీయస్ ,వైద్య, డైట్‌స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

కొత్త రేషన్ కార్డులొచ్చాయ్

- ప్రజల చెంతకే నిత్యావసరాలు
- జిల్లాలో 4079 కొత్తకార్డులు మంజూరు
- జనవరి నెల నుంచే రేషన్ సరుకుల పంపిణీ
- జిల్లాలో 5,02,853 కార్డులకు నిత్యావసర సరుకులు పంపిణీ

రాయచోటి: ప్రజా సంక్షేమం.. అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనను సాగిస్తున్నారు. ప్రజల ఇంటివద్దకే సంక్షేమ పథకాలను అందిస్తున్నారు. ఇందులో భాగంగా నిత్యవసర సరుకుల పంపిణీ, రేషన్ కార్డులు మంజూరుకు పెద్దపీట వేస్తున్నారు. వాహనాలు ద్వారా సరుకులను లబ్ధిదారుల ఇళ్లకు చేరవేయడంతోపాటు ప్రతి ఆరు నెలలకు ఒకసారి కొత్తరేషన్ కార్డులను అందిస్తున్నారు. దరఖాస్తులు పెట్టుకోవడమే తరువాయి అన్న రీతిగా అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వం రేషన్ కార్డులను అందిస్తోంది. అన్నమయ్య జిల్లా పరిధిలో రేషన్ కార్డుల ఎంపిక ప్రక్రియలో భాగంగా అర్హత కల్గిన లబ్ధిదారులను గుర్తించింది. ఈ ఏడాది మొదట్లోనే 4079 రేషన్ కార్డులు కొత్తగా మంజూరు చేశారు. ప్రజలు కోరిన విధంగా అర్హత మేరకు కొత్తకార్డులు అందుతుండటంతో సర్వత్రా హర్షం వ్యక్తం అవుతుంది.




5.2 లక్షల మందికి రేషన్ కార్డులు

గత ఏడాది జూలైలో రేషన్ కార్డులను అందించిన ప్రభుత్వం నూతన సంవత్సరం కానుకగా మళ్లీ కార్డులు మంజూరు చేసింది. జిల్లాలో ఇప్పటికే 5 లక్షల కార్డులకు సంబంధించి ప్రతినెల 7464 టన్నుల బియ్యం ఉచితంగా అందిస్తున్నారు. ఈ నెలలో కొత్తగా 4079 రేషన్ కార్డులు మంజూరు చేశారు. కార్డులో కుటుంబ సభ్యులను బట్టి ఒక్కొక్కరికి ఐదు కిలోల బియ్యాన్ని అందించేందుకు చర్యలు తీసుకున్నారు. కొత్త కార్డులకు ఈ నెల నుంచి రేషన్ సరుకులు సరఫరా చేస్తున్నారు. ప్రతినెల అంత్యోదయ కార్డులకు 35 కిలోల బియ్యం ఉచితంగా రూ. 13.50కు కిలో పంచదార అందిస్తున్నారు. తెల్లరేషన్ కార్డుదారులకు రూ. 67లకు కిలో కందిపప్పు, రూ. 17లకు అరకిలో పంచదార, రూ. 16లకు గోధుమపిండితోపాటు కుటుంబంలోని ఒక్కొక్కరికి ఐదు కిలోల బియ్యం ఉచితంగా పంపిణీ చేస్తున్నారు.

అన్నమయ్య జిల్లాలో కొత్తగా మంజూరైన రేషన్ కార్డుల వివరాలు మండలాల వారీగా..

తంబళ్లపల్లి 94, చిన్నమండెం72, రాయచోటి 298, రామసముద్రం 99, పెద్దతిప్ప సముద్రం 156, రాజంపేట 272, బి కొత్తకోట 164, ములకల చెరువు 103, కురబలకోట 102, గుర్రంకొండ 128, కలికిరి 137, చిట్వేలి 84, పెద్దమండెం 83, టి సుండుపల్లె 156, నిమ్మనపల్లి 93, రామాపురం 97, ఓబులవారిపల్లె 100, కంభంవారిపల్లి 103, కలకడ 97, వాల్మీకిపురం 97, సంబేపల్లె 74, వీరబల్లి 87, నందలూరు 76, కోడూరు 166, మదనపల్లి 581, గాలివీడు 121, పుల్లంపేట 106, లక్కిరెడ్డిపల్లి 52, పీలేరు 165, పెనగలూరు 116 కార్డులు మంజూరయ్యాయి.

పోర్టిఫైడ్ బియ్యం



జిల్లా వ్యాప్తంగా బలవర్ధకమైన ఆహారాన్ని అందించేందుకు ఇప్పటికే చర్యలు తీసుకున్న జిల్లా అధికారులు ప్రజలందరికీ పోర్టిఫేడ్ బియ్యాన్ని సరఫరా చేస్తున్నారు. ఈ బియ్యంలో పోషకాలు అధికంగా ఉంటాయని అధికారులు చెబుతున్నారు. ప్రజారోగ్యరీత్యా గతంలో ఎన్నడూ లేని విధంగా నిత్యవసరాలు అందిస్తుండడం విశేషం. అలాగే వీటిని ప్రజలు వినియోగించుకునేలా అవగాహన కార్యక్రమాలను కూడా నిర్వహిస్తున్నారు.

క్లుప్తంగా

108లో ప్రసవం


108లో ప్రసవించిన బిడ్డతో సిబ్బంది

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు నియోజకవర్గ పరిధిలో ఓ గర్భిణి 108 వాహనంలో ప్రసవించింది. వివరాలు ఇలా.. తుమ్మకొండ గ్రామానికి చెందిన పి.కళావతి ప్రసవ నొప్పులు రావడంతో ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లేందుకు 108కు బుధవారం ఫోన్ చేశారు. హుటాహుటిన 108 గ్రామానికి చేరుకుని గర్భిణిని కోడూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకు వస్తుండగా మార్గమధ్యంలో నొప్పులు అధికమయ్యాయి. ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ రఘునాథ్, 108 సిబ్బంది ఆమెకు సుఖ ప్రసవం అయ్యేలా చర్యలు తీసుకున్నారు. తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉన్నారు. దీంతో భర్త మురళి, 108 వాహనం ఎంతో సాయపడిందని ఆనందం వ్యక్తం చేశారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు శిక్ష

నందలూరు(రాజంపేట) : మద్యం సేవించి ద్విచక్రవాహనం, ఆటో నడిపినందుకు ఇద్దరికి నందలూరు జూనియర్ సివిల్ జడ్జి కె.లత జైలు శిక్ష విధించారు. ద్విచక్రవాహనం నడిపిన వ్యక్తికి నాలుగు రోజులు, ఆటో నడిపిన వ్యక్తికి ఏడు రోజుల జైలుశిక్షను విధిస్తూ తీర్పు చెప్పారు. పోలీసుల వివరాల మేరకు కర్నూలు జిల్లా పత్తికొండకు చెందిన ఆవుల పులికొండ, కోడూరుకు చెందిన రాంబాబులను డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఈమేరకు శిక్ష విధించారు. నిందితులను రిమాండ్ నిమిత్తం రాజంపేట సబ్ జైలుకు తరలించినట్లు వారు తెలిపారు.

ఆటో బోల్తా
– ఆశా కార్యకర్త మృతి


మృతిచెందిన జయమ్మ

మదనపల్లె సిటీ : ఆటో బోల్తా పడిన సంఘటనలో ఓ ఆశా కార్యకర్త మృతి చెందిన సంఘటన మంగళవారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు.. చిత్తూరు జిల్లా పుంగనూరు మండలం నేతిగుట్లపల్లెకు చెందిన ఆశా కార్యకర్త జయమ్మ(32) భర్త బాబు(40)తో కలిసి పుంగనూరుకు బంధువుల ఇంటికి వెళ్లారు. తిరిగి ఇంటికి ఆటోలో వెళుతుండగా మార్గమధ్యంలో సుగాలిమిట్ట వద్ద ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో జయమ్మ తీవ్రంగా గాయపడింది. స్థానికులు వెంటనే 108 వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆస్పత్రిలో ఆమె మృతి చెందింది. భర్త బాబు స్వల్పంగా గాయపడ్డాడు. ఈ మేరకు ఆస్పత్రి ఔట్‌పోస్టు పోలీసులు పుంగనూరు పోలీసులకు సమాచారం అందించారు.

అందరికీ అమ్మ.. జయమ్మ

- సర్పంచ్‌గా సేవలు.. రోటరీ క్లబ్ ద్వారా సమాజ సేవ
- అందరి కష్టంలో పాలుపంచుకున్న జయమ్మ
- నేడు వైఎస్ జయమ్మ 18వ వర్ధంతి


భర్త వైఎస్ రాజారెడ్డితో వైఎస్ జయమ్మ(ఫైల్)

పులివెందుల : అడగందే అమ్మ అయినా అన్నం పెట్టదంటారు.. కానీ ఏమీ అడగకుండానే అందరికి అన్నీ పంచి ఇచ్చిన అమ్మ వైఎస్ జయమ్మ. మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి మాతృమూర్తి వైఎస్ జయమ్మ. వైఎస్ జయమ్మ జీవించి ఉన్నంతకాలం పులివెందులకు సంబంధించిన ప్రజల కష్టసుఖాల్లో పాలు పంచుకుంటూ అనునిత్యం దాన ధర్మాలలో మునిగిపోయేవారు. తనయుడు వైఎస్ రాజశేఖర రెడ్డి సీఎం కావాలన్న చిరకాల వాంఛ నెరవేరిన తర్వాత 2006 జనవరి 25వ తేదీన వైఎస్ జయమ్మ తుదిశ్వాస విడిచారు. అంతకుమునుపు 2003లో ప్రజల కష్టసుఖాలను తెలుసుకొనేందుకు వైఎస్ఆర్ పాదయాత్ర చేసిన సందర్భంలో తల్లిగా వైఎస్ జయమ్మ కుమిలిపోతూనే.. పాదయాత్ర చేస్తున్న బిడ్డకు మంచి జరగాలని ప్రతిరోజు ప్రార్థించేవారు. అంతేకాదు 1999 ప్రాంతంలో విపరీతమైన కరువు పరిస్థితులు ఏర్పడినప్పుడు పది మందికి పట్టెడు అన్నం పెట్టాలని భావించిన మాతృమూర్తి వైఎస్ జయమ్మ. అప్పటి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ప్రతిరోజు ఐదారు వందల మందికి ఉచిత భోజన సౌకర్యాన్ని కల్పించి ప్రశంసలు అందుకున్నారు. అంతేకాకుండా 1995 నుంచి 2000 వరకు పులివెందుల సర్పంచ్‌గా పనిచేసిన వైఎస్ జయమ్మ అప్పటి ప్రభుత్వం నుంచి ఉత్తమ సర్పంచ్ అవార్డుతోపాటు పంచాయతీని ఆదర్శంగా నిలిపి ఉత్తమ పంచాయతీ అవార్డును సైతం సొంతం చేసుకున్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే వైఎస్ జయమ్మ జీవించినంత కాలం ఎప్పుడూ ప్రజల గురించి ఆలోచిస్తూ పులివెందుల అమ్మగా గుర్తింపు పొందారు. ఆమె మరణించి నేటికి సరిగ్గా 18 ఏళ్లు అవుతోంది.

నేడు కుటుంబ సభ్యుల నివాళి

దివంగత వైఎస్ రాజారెడ్డి సతీమణి వైఎస్ జయమ్మ 18వ వర్ధంతిని గురువారం పులివెందులలో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ కుటుంబ సభ్యులు పాల్గొననున్నారు. వైఎస్ జయమ్మ సమాధి వద్ద ప్రార్థనలతోపాటు జయమ్మ పార్క్‌లో జయమ్మ విగ్రహం వద్ద ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తల్లి, మాజీ ఎమ్మెల్యే వైఎస్ విజయమ్మ, దివంగత వైఎస్ జార్జిరెడ్డి సతీమణి వైఎస్ భారతమ్మలతో పాటు వైఎస్ కుటుంబ సభ్యులు నివాళులర్పించనున్నారు. ఈమేరకు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. వైఎస్ కుటుంబ సభ్యులతోపాటు పలువురు వైఎస్ఆర్ అభిమానులు కూడా ఈ కార్యక్రమంలో పాలు పంచుకుంటారు.

నవశకం

నాడు-నేడుతో పాఠశాలలకు మహర్దశ



వైఎస్ జగన్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాడు-నేడు కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ కలిగింది. పాఠశాల రూపురేఖలే మారిపోవడమే కాకుండా కార్పొరేట్ పాఠశాలలను తలదన్నేలా పాఠశాల భవనాలు చక్కగా రూపుదిద్దుకున్నాయి. దేశంలోనే ప్రభుత్వ పాఠశాలలను ఈ మాదిరిగా చూడలేం. ప్రజలు సీఎం జగన్‌కు రుణపడి ఉంటారు. – షేక్.జాఫర్‌వలి, బాలికల జెడ్పీ హైస్కూల్ చైర్మన్, చిన్నమండెం

ఒక్కరోజులోనే ధ్రువ పత్రాలు మంజూరు



ఆదాయం, కుల ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్న ఒక్కరోజుకే పత్రాలను ఇస్తున్నారు. గతంలో మండల కేంద్రంలోని కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగి ఇబ్బందులు పడేవాళ్లం. ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అలా కాకుండా గ్రామంలోనే సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజలకు అవసరమైన సేవలు అందిస్తున్నారు. ప్రజల అవసరాలను వలంటీర్ల ద్వారా గుర్తించి అవసరమైన వారికి పత్రాలను ఒక్క రోజులోనే ఇంటి వద్దకు తీసుకు వచ్చి ఇస్తున్నారు. చాలా సంతోషంగా ఉంది. – వర్దిరెడ్డి రంగజ్యోతి, ఐ కొత్తపల్లె, వీరపునాయునిపల్లె మండలం

మరియాపురంలో 50 కుటుంబాలు
వైఎస్సార్‌సీపీలో చేరిక


వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిన వారితో ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా తదితరులు

కడప కార్పొరేషన్ : కడప నగరంలోని మరియాపురం, భవానీనగర్, ఎస్‌బీఐ కాలనీ, అరుంధతి నగర్‌లకు చెందిన 50 కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్ కుమార్, ఎండీ అల్ఫోన్స్, చిట్టిబాబు ఆధ్వర్యంలో ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా, టీటీడీ బోర్డు సభ్యుడు మాసీమ బాబు, 40వ డివిజన్ కార్పొరేటర్ ఆర్. బాలస్వామిరెడ్డి ఆధ్వర్యంలో వీరు వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పుకున్నారు. అంజద్‌బాషా వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన 98 శాతం హామీలను అమలు చేసిందన్నారు. నవరత్న పథకాల వల్ల ప్రతి కుటుంబానికి లక్ష నుంచి పది లక్షల వరకూ లబ్ధి చేకూరిందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం అవ్వాతాతలకిచ్చే పింఛన్ రూ.3వేలకు పెంచారన్నారు. జగనన్న సుపరిపాలన, ఇచ్చిన మాటకు కట్టుబడే తత్వాన్ని చూసి చాలామంది పార్టీలో చేరుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, బంగారు నాగయ్య యాదవ్, ఎస్. సుబ్బారెడ్డి, షఫీ, ఉమైర్, ప్రదీప్ పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

బీసీసీపీఎల్ సీఎంఓ సాయిరమేష్


రోడ్డు భద్రతా వారోత్సవాల్లో పాల్గొన్న పరిశ్రమ ప్రతినిధులు, కార్మికులు

కమలాపురం : ప్రతి ఒక్క వాహన డ్రైవర్ భద్రతా నియమాలు పాటించాలని భారతి సిమెంట్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ (బీసీసీపీఎల్) సీఎంఓ సాయి రమేష్ తెలిపారు. బుధవారం జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని మండలంలోని నల్లింగాయపల్లెలోని బీసీసీపీఎల్‌లో ఆయన వాహన డ్రైవర్లకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. ట్రక్కులు, ట్రాక్టర్లు, బైకులకు రేడియం స్టిక్కర్లు అతికించడంతో పాటు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. డ్రైవర్లకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వాహన డ్రైవర్ రోడ్డు భద్రతా నియమాలు పాటించినపుడే గమ్య స్థానాలకు సురక్షితంగా చేరవచ్చన్నారు. రెప్పపాటు కాలంలోనే ప్రమాదాలు ముంచుకొస్తాయన్నారు. డ్రైవర్లు అజాగ్రత్తగా, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రమాదాల బారిన పడతారని, తద్వారా కుటుంబ సభ్యులు వీధిన పడతారని గుర్తు చేశారు. అలాగే వాహనాలు నడిపే సమయంలో హెల్మెట్, సీటు బెల్ట్ తప్పక ధరించాలన్నారు. ముఖ్యంగా మద్యం సేవించి వాహనాలు నడపవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో డీజీఎం జగదీశ్వర్ రెడ్డి, హెచ్‌ఆర్ హెడ్ గోపాల్‌రెడ్డి, సేఫ్టీ ఆఫీసర్ జి.మహేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శాంతియుత మార్గమే 'మునిరెడ్డి' ఆయుధం

విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే రఘురామిరెడ్డి


మునిరెడ్డి విగ్రహం వద్ద ఎమ్మెల్యే రఘురామిరెడ్డి తదితరులు

రాజుపాళెం : స్వాతంత్య్ర సమరయోధుడు రావుల మునిరెడ్డి శాంతిని ఆయుధంగా చేసుకుని బ్రిటీషు వారితో పోరాడారని మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. రావుల మునిరెడ్డి విగ్రహాన్ని రాజుపాళెం మండలంలోని వెలవలి గ్రామంలో బుధవారం రాష్ట్ర డీజీపీ కసిరెడ్డి రాజేంద్రనాథ రెడ్డి తండ్రి కసిరెడ్డి వెంకటపతి రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహాత్మాగాంధీ ఆశయాలు, సిద్ధాంతాలకు ఆకర్షితుడై మునిరెడ్డి స్వాతంత్య్ర ఉద్యమంలో పాల్గొన్నారన్నారు. అప్పట్లోనే వేలూరు జైలుకు కూడా వెళ్లారన్నారు. గ్రామాల్లో కక్షల నివారణకు శాంతి సంఘం ఏర్పాటు చేసి సేవలు అందించారన్నారు. వెంకటపతి రెడ్డి మాట్లాడుతూ స్వాతంత్య్రం కోసం పోరాడిన ఇలాంటి మహానుభావుల పోరాటం, సేవలకు గుర్తుగా స్మారక మందిరం నిర్మించాలని సూచించారు. తనవంతుగా రూ.లక్ష ఇస్తానని ప్రకటించారు. అనంతరం మునిరెడ్డి కుమారులు హనుమారెడ్డి, సుధాకర్ రెడ్డి, తమ్ముని కుమారుడు రావుల రామమునిరెడ్డిలను వెంకటపతి రెడ్డి సన్మానించారు. మునిరెడ్డి విగ్రహానికి ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి, మండల ఇన్‌చార్జి ఎంపీపీ నారాయణ రెడ్డి, దువ్వూరు ఎంపీపీ జయచంద్రా రెడ్డి, అటవీశాఖ డైరెక్టర్ సానపురెడ్డి ప్రతాపరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు కసిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, పరిమళ, మునిరెడ్డి కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్‌ఎంలు చెన్నారెడ్డి, శివశంకర్‌రెడ్డి, లక్ష్మిరెడ్డి, గంగరాజు, రిటైర్డ్ ఈఈ రామసుబ్బారెడ్డి, రూరల్ సీఐ రమణారెడ్డి, ఎస్ఐ తులసీ నాగ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి


మృతి చెందిన జీవన్ కుమార్

ముద్దనూరు : ద్విచక్రవాహనంపై వెళుతూ ఈ నెల 20వ తేదీన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన జీవన్ కుమార్(16) అనే యువకుడు బుధవారం మృతి చెందాడు. ఎస్ఐ మైనుద్దీన్ సమాచారం మేరకు తాడిపత్రికి చెందిన జీవన్ కుమార్ అతని స్నేహితుడు మోక్షేశ్వర్ రెడ్డితో కలసి ఈనెల 19వ తేదీన కడపలో ఉన్న తమ స్నేహితుడిని కలిసేందుకు వెళ్లారు. అక్కడ స్నేహితుడితో కలిసి తిరిగి 20వ తేదీ సాయంత్రం మోటార్ బైక్ పై ఇరువురు తాడిపత్రికి బయలుదేరారు. జీవన్ కుమార్ బైకు నడుపుతుండగా మోక్షేశ్వర్ రెడ్డి వెనుక కూర్చున్నాడు. మండలంలోని చింతకుంట గ్రామ సమీపంలోకి రాగానే బైకు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న గుంతలో పడిపోయింది. ఈ ప్రమాదంలో జీవన్ కుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన ఇద్దరిని ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం ఇరువురికి మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ జీవన్ కుమార్ బుధవారం మరణించాడు. మోక్షేశ్వర్ రెడ్డి అక్కడే చికిత్స పొందుతున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

అట్లూరు : మండల పరిధిలోని బోడిశెట్టిపల్లె గ్రామానికి చెందిన రంపాటి మునెమ్మకు చెందిన ఇల్లు షార్ట్ సర్క్యూట్‌తో బుధవారం మధ్యాహ్నం దగ్ధమైంది. బాధితురాలి వివరాల మేరకు బుధవారం మధ్యాహ్నం ఇంటికి తలుపు వేసి పక్కింట్లో టీవీ చూస్తుండగా ఉన్నఫళంగా ఇంట్లో నుంచి మంటలు చెలరేగాయి. చుట్టుపక్కల వారిని పిలిపించి మంటలను ఆర్పి ఇంట్లోకి వెళ్లి చూడగా అప్పటికే ఇంట్లోని బీరువాతో పాటు సామగ్రి పూర్తిగా కాలి బూడిదయ్యాయి. దీంతో కట్టు బట్టలతో మిగిలామని, కుమార్తె పెళ్లి కోసం కూడబెట్టుకున్న కొద్దోగొప్పో బంగారం, నగదు అగ్నికి ఆహుతి అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు.

బ్లాక్ స్పాట్ల సవరణలపై సమావేశం

రాయచోటి టౌన్ : భద్రతా వారోత్సవాల్లో భాగంగా బ్లాక్ స్పాట్ల సవరణ వ్యూహంపై బుధవారం అధికారులతో అన్నమయ్య జిల్లా వాహనాల తనిఖీ అధికారి దినేష్ చంద్ర వీడియో, ఫోన్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్ అండ్‌బీ ఈఈ సహదేవరెడ్డి, పోలీసులు, ఎన్‌హెచ్‌ఏ అధికారులు పాల్గొన్నారు. ఎలాంటి ప్రదేశాలను బ్లాక్ స్పాట్లుగా గుర్తించాలనే విషయాలపై చర్చించారు.

యువతి అదృశ్యం


నందిని(ఫైల్)

ఒంటిమిట్ట : మండల పరిధిలోని బోయపల్లి గ్రామానికి చెందిన కోటిక నందిని (19) అనే యువతి బుధవారం అదృశ్యమైనట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు...బోయపల్లికి చెందిన కోటిక రవిశంకర్, లక్ష్మీదేవి దంపతుల కుమార్తె అయిన నందిని మదనపల్లిలోని జ్ఞానాంబిక కళాశాలలో డిగ్రీ చదువుతోంది. కొన్ని రోజుల క్రితం ఇంటికి వచ్చింది. బుధవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి కనిపించలేదు. పలుచోట్ల విచారించినా ఫలితం లేదు. దీంతో ఆమె తల్లి లక్ష్మీదేవి స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

చెరువులో పడి మహిళ ఆత్మహత్య


సుజాత (ఫైల్)

కురబలకోట : మండలంలోని అంగళ్లు గ్రామం మల్లేల గడ్డ వద్ద ఉన్న రామక్క చెరువులో పడి సుజాత (30) అనే మహిళ ఆత్మహత్య చేసుకుంది. బుధవారం మృతదేహం బయటపడింది. పోలీసుల కథనం మేరకు..జగన్ కాలనీకి చెందిన సుజాత మండలంలోని అంగళ్లు మార్గంలోని ఓ కళాశాలలో రిసెప్షనిస్టుగా పనిచేసేది. ఈనెల 19న అదృశ్యమైంది. ఈనెల 21న ముదివేడు స్టేషన్‌లో మిస్సింగ్ కేసు కూడా నమోదైంది. ఈ క్రమంలో ఆమె బుధవారం మధ్యాహ్నం అంగళ్లు సమీపంలోని రామక్క చెరువులో శవమై కన్పించింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కడుపు నొప్పి తాళలేక ఆమె ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని ఆమె తండ్రి మేకల నరసింహులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సారా బట్టీపై పోలీసుల మెరుపు దాడులు


పాలెంకొండలో పోలీసులు స్వాధీనం చేసుకుంటున్న బెల్లం ఊట డ్రమ్ములు

మదనపల్లె : మండలంలోని కొత్తవారిపల్లె పంచాయతీ పాలెంకొండలో పెద్ద ఎత్తున బట్టీలు ఏర్పాటుచేసి, సారా వండుతున్నారన్న సమాచారం మేరకు డీఎస్పీ కేశప్ప ఆదేశాలతో..బుధవారం పోలీసులు మెరుపుదాడులు నిర్వహించారు. తాలూకా సీఐ ఎస్.శేఖర్ ఆధ్వర్యంలో ఎస్ఐ, పోలీసు సిబ్బంది జరిపిన తనిఖీల్లో సారా తయారీకి వినియోగించే బెల్లం ఊట డ్రమ్ములను గుర్తించారు. వీటి నుంచి 1,800 లీటర్లకు పైగా ఊటను ధ్వంసం చేశారు. తర్వాత రవాణాకు సిద్ధంగా ఉంచిన 30 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని నిందితుల కోసం గాలిస్తున్నామన్నారు.

ప్రపంచ స్థాయి పరిశ్రమగా పర్యాటక రంగం

వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్


పర్యాటకం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్, ఇతర అతిథులు

కడప కల్చరల్ : నేడు పర్యాటక రంగం ప్రపంచ స్థాయి పరిశ్రమగా గుర్తింపు సాధిస్తోందని యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య చింతా సుధాకర్ అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ విద్యా మండలి విశ్రాంత సంయుక్త కార్యదర్శి అలపర్తి పిచ్చయ్య చౌదరి రచించిన 'పర్యాటకం– రూట్స్ అండ్ ఫ్రూట్స్ ఆఫ్ టూరిజం' పుస్తకావిష్కరణ సభ ఇంటాక్ (భారత జాతీయ కళా వారసత్వ పరిరక్షణ సంస్థ), రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటి సంయుక్త ఆధ్వర్యంలో ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆచార్య చింతా సుధాకర్ మాట్లాడుతూ పిచ్చయ్యచౌదరి ఆసక్తితో ప్రపంచ వ్యాప్తంగా తాను చూసిన పర్యాటక ప్రాంతాల గురించి రాయగలిగారన్నారు. సభాధ్యక్షుడు, ఇంటాక్ కడప చాప్టర్ కన్వీనర్ కె.చిన్నపరెడ్డి మాట్లాడుతూ ప్రపంచ స్థాయి వారసత్వ ప్రదేశాల పట్ల మనతో పాటు భావి పౌరులకు అవగాహన కల్పించేలా పుస్తకాన్ని రూపొందించారన్నారు. ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవీంద్రనాథ్ మాట్లాడుతూ ప్రపంచంలోనే గొప్ప పర్యాటక ప్రాంతాలు మనదేశంలో ఉన్నందుకు గర్వించాలన్నారు. మహిళా కళాశాల ప్రిన్సిపాల్ వి.సలీంబాషా మాట్లాడుతూ పర్యాటక రంగం ద్వారా దేశాల మధ్య సంస్కృతి, సంప్రదాయాల గురించి అవగాహన కల్పించుకోవచ్చన్నారు. గౌరవ అతిథి, వైవీయూ పాలకమండలి సభ్యుడు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి రచయిత, పుస్తకం గురించి పద్యాలాపన చేశారు. పుస్తక రచయిత అలపర్తి పిచ్చయ్య చౌదరి మాట్లాడుతూ తాను చూసింది, శోధించి పుస్తకంగా రాశానని.. ఇది రేపటి తరానికి ఉపయోగపడుతుందని ఆకాంక్షించారు. పుస్తకాన్ని కళాశాలలకు ఉచితంగా అందజేస్తానని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం సభ్యుడు డాక్టర్ తవ్వా వెంకటయ్య పుస్తకాన్ని సమీక్షించారు. రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్దన్ రాజు, అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ తుమ్మలూరు సురేష్ బాబు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. అనంతరం నిర్వాహకులు అతిథులను సత్కరించారు. సభ ప్రారంభంలో కడప జిల్లా పర్యాటక పితామహుడు సిద్ధవటం సీతారామయ్య మృతికి సంతాపంగా కొన్ని నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పోచం రెడ్డి సుబ్బారెడ్డి, వేంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల చరిత్ర అధ్యాపకులు బాలగొండ గంగాధర్, ప్రభుత్వ పురుషుల కళాశాల టూరిజం విభాగాధిపతి డాక్టర్ శివ పార్వతి తదితరులు పాల్గొన్నారు.

రామాలయంలో చోరీ

వేంపల్లె : స్థానిక పులివెందుల రోడ్డులోని టీచర్స్ కాలనీలో ఉన్న శ్రీరాముని ఆలయంలో చోరీ జరిగింది. మంగళవారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు. మంగళవారం రాత్రి ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని దుండగులు ఆలయం వాకిళ్ల పగులగొట్టి దొంగతనానికి పాల్పడ్డారు. సుమారు రూ.4లక్షలు విలువ చేసే బంగారు నగలు, వెండి కిరీటాలు అపహరించారు. ఆ కాలనీ వాసులు తెల్లవారిన తర్వాత ఆయల వాకిళ్లు తెరిచి ఉంచడంతో ఎవరో దొంగలు పడ్డారని గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానికుల సమాచారం మేరకు స్థానిక సీఐ చాంద్ బాషా, ఎస్ఐ తిరుపాల్ నాయక్‌లు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ విషయంపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నారు.

వేంపల్లెలో బైకు చోరీ..

స్థానిక హనుమాన్ జంక్షన్ సమీపంలో పాల వ్యాపారం చేసుకునే రామచంద్రారెడ్డి అనే వ్యక్తి బైకు చోరీకి గురైంది. మంగళవారం తన వ్యాపారం ముగించుకుని రాత్రి యధావిధిగా తన ఇంటి ముందు బైకు, ఆటోను పార్కు చేశారు. తెల్లవారుజామున పాల వ్యాపారం కోసం బయటకు వచ్చి చూడగా తన బైకు కనిపించలేదు. ఆటోకు వైర్లు కట్ చేసి తీసుకెళ్లేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. బైకు తాళం పగులగొట్టి ఎత్తుకెళ్లారు. బాధితుడు వేంపల్లె పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మద్యం లారీ బోల్తా



పోరుమామిళ్ల : పోరుమామిళ్ల – కొమరోలు దారిలో చింతలపల్లె సమీపంలో బుధవారం తెల్లవారుజామున మద్యం లారీ బోల్తా పడిన ఘటనలో లారీలో ఉన్న మద్యం బాక్సులన్నీ కింద పడ్డాయి. రేణిగుంట నుంచి ఒంగోలుకు మద్యం తీసుకెళుతున్న లారీ అదుపు తప్పి బోల్తా పడింది. ఎదురుగా వస్తున్న వాహనం దారి ఇవ్వకపోవడంతో కొద్దిగా పక్కకు జరిగానని, పక్కన గుంత ఉండటంతో బోల్తా పడిందని లారీ డ్రైవర్ చెప్పాడు. సమాచారం తెలియడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, మద్యం తరలిపోకుండా చర్యలు తీసుకున్నారు. ప్రమాదంలో ఎవరూ గాయపడలేదు.

ఆటో ఢీకొని దంపతులకు గాయాలు

ఓబులవారిపల్లె : మండల కేంద్రంలో బుధవారం ఆటో ఢీకొనడంతో కె.సుబ్బలక్షుమ్మ, నాగయ్య దంపతులకు గాయాలయ్యాయి. స్థానికుల కథనంమేరకు ఓబులవారిపల్లి నుంచి శివశంకరాపురం గ్రామానికి కూరగాయల బండిని తోలుకుంటూ సుబ్బలక్షుమ్మ, నాగయ్య దంపతులు వెళ్తుండగా మినరల్ వాటర్ ఆటో ఢీ కొంది. దీంతో కూరగాయల బండి పల్టీకొట్టగా వారిద్దరికీ గాయాలయ్యాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం రైల్వేకోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు.

అక్రమ మద్యం బాటిళ్లు స్వాధీనం

వల్లూరు : వల్లూరు మండల పరిధిలో మంగళవారం రాత్రి, బుధవారం నిర్వహించిన దాడుల్లో 60 అక్రమ మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ వెంకటరమణ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు తమ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి మండలంలోని తోల్లగంగనపల్లెలో 30, పెద్దపుత్తలో 20, మిట్టపల్లెలో 10 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.